సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
సోమవారం, 1, మే, 2023



వైభవంగా నగరోత్సవం

ఆర్యవైశ్యుల ఇలవేల్పు వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి నగరోత్సవం ఆదివారం రాత్రి నెల్లూరులోని స్టోన్‌హౌస్‌పేట తదితర ప్రాంతాల్లో వైభవంగా జరిగింది.

8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.62,130
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,549
3 శాతం జీఎస్టీతో	రూ.5,715
నవర (8గ్రా)	రూ.45,720

గరిష్టం/కనిష్టం
35.9 /28.5

వాతావరణం

ఆదివారం గాలిలో 66 శాతం తేమ ఉంది. వాతావరణంలో ఎలాంటి మార్పులు ఉండవు. సోమవారం సాధారణ ఉష్ణోగ్రతలు కొనసాగుతాయని వాతావరణ శాఖ తెలిపింది.

న్యూస్‌రీల్

సోమశిలలో 50.980 టీఎంసీలు

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో ఆదివారం సాయంత్రానికి 50.980 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 197 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. కాగా పెన్నార్ డెల్టాకు 450 క్యూసెక్కులు, ఉత్తర కాలువకు 350, దక్షిణ కాలువకు 50, కండలేరుకు 300 క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయంలో 96.484 మీటర్ల నీటి మట్టం ఉంది.

కామాక్షితాయి సేవలో ఎస్పీ



ఆలయంలో ఎస్పీ, ఆయన కుటుంబసభ్యులు

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో వెలసిన మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి అమ్మవారిని ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి తన కుటుంబసభ్యులతో కలిసి ఆదివారం దర్శించున్నారు. ముందుగా ఆలయ అర్చకులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం గణపతి స్వామి, సుబ్రహ్మణ్యం స్వామి, మల్లికార్జున స్వామి, కామాక్షితాయి అమ్మవార్లకు ప్రత్యేక పూజలను నిర్వహించారు. అక్కడ జరుగుతున్న మహా కుంభాభిషేక వేడుకల్లో ఎస్పీ పాల్గొన్నారు. అనంతరం ఆయన్ను శేషవస్త్రాలతో సత్కరించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యం నాయుడు, ఈఓ వెంకటేశ్వర్లు, సీఐ రామారావు, ఎస్సై వీరప్రతాప్ పాల్గొన్నారు.

4 నుంచి ఎలక్ట్రిక్ బస్సుల ప్రారంభం

- నెల్లూరుకు నుంచి తిరుపతికి..
- జిల్లా చేరుకున్న 12 బస్సులు



నెల్లూరుకు చేరుకున్న ఎలక్ట్రిక్ బస్సులు

నెల్లూరు సిటీ: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రభుత్వం దశల వారీగా ఎలక్ట్రిక్ వాహనాలు అందుబాటులోకి తెస్తోంది. నెల్లూరు ఆర్టీసీ బస్టాండ్ నుంచి తిరుపతికి బస్సులను నడిపేందుకు ఆర్టీసీ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ నెల 4వ తేదీన బస్సులను ప్రారంభించనున్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే 12 బస్సులు నెల్లూరుకు చేరుకున్నాయి. కాగా నెల్లూరు నుంచి తిరుపతికి నాన్‌స్టాప్ బస్సులు రాకపోకలు సాగిస్తున్న విషయం తెలిసిందే. ఆ బస్సులతోపాటు ఎలక్ట్రిక్ బస్సులు కూడా తిరగనున్నాయి.

బస్సుల ప్రత్యేకత

ఇవి విద్యుత్ చార్జింగ్‌తో నడుస్తాయి. డ్రైవర్ సీట్‌తో కలిపి మొత్తం 36 సీట్లు ఉంటాయి ఏసీ సౌకర్యం ఉంటుంది. బస్సుకు ఒకసారి ఫుల్ చార్జింగ్ పెడితే 250 కి.మీ నడుస్తుంది. ఫుల్ చార్జింగ్ అవ్వాలంటే 2.40 నిమిషాలు పడుతుంది. బస్సులో నాలుగు సీసీ కెమెరాలు ఉంటాయి. అన్ని అద్దాలకు ఎమర్జెన్సీ విండోస్‌ను ఏర్పాటు చేశారు. ప్రమాద సమయంలో అద్దాలను పగులగొట్టి బయటకు రావచ్చు.

యార్డులో దుకాణాల వేలం వాయిదా

పొదలకూరు: స్థానిక నిమ్మ మార్కెట్ యార్డులో వలంటరీ ట్రేడ్ లైసెన్స్ తీసుకున్న వ్యాపారులకు 2వ తేదీ నిర్వహించాల్సిన దుకాణ బహిరంగ వేలం వాయిదా వేసినట్లు ఏఎంసీ సెక్రటరీ నవీన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్కెటింగ్ శాఖ జేడీ ఆధ్వర్యంలో నూతన దుకాణాల కేటాయింపు వేలం నిర్వహిస్తామని తొలుత ప్రకటించామన్నారు. అయితే పాలనాపరమైన కారణాలతో వేలం వాయిదా పడిందని, ఎప్పుడు నిర్వహించేది త్వరలో తెలియజేస్తామన్నారు.




స్టోన్‌హౌస్‌పేటలోని హోల్‌సేల్ దుకాణాలకు వచ్చిన సరుకులను మోసుకెళ్తూ..



నెల్లూరులో పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహం సర్కిల్లో ఇలా..



వెల్డింగ్ చేస్తున్న కార్మికుడు

కార్మిక శక్తి

కార్మిక లోకం.. వీరికి పగలు, రాత్రి అనే తేడా ఉండదు. వర్షాలు, తీవ్ర ఎండను పట్టించుకోరు. ఊపిరి సలపని శ్రమతో బతుకుపోరులో ముందుకెళ్తుంటారు. సోమవారం మేడే సందర్భంగా నెల్లూరు నగరంలోని అనేక చోట్ల కార్మికులు ఎర్ర జెండాలు కట్టారు. వేడుకలు చేసుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

సాగుకు జీవం

ఒకప్పుడు జిల్లాలో పంటలకు సాగునీరందక రైతులు అల్లాడిపోయారు. అనేకమంది వ్యవసాయాన్ని వదిలేశారు. నేడు ఆ పరిస్థితి లేదు. నాలుగు సంవత్సరాల నుంచి వర్షాలు కురుస్తున్నాయి. జలాశయాల్లో వరద నీరు పెద్ద ఎత్తున చేరుతోంది. పంటలు పండించేందుకు నీటి సమస్య లేదు. గతంలో నీరు లేక రెండో పంటవేయని సందర్భాలున్నాయి. ప్రస్తుతం సమృద్ధిగా సాగునీరు అందుతోంది.

- నేటి నుంచి రెండో పంటకు నీటి విడుదల
- క్రమం తప్పకుండా నాలుగోసారి
- ఒకప్పుడు ఈ పరిస్థితి లేదు
- ఇబ్బందులు పడిన అన్నదాతలు
- నేడు ఆనందంగా సాగు పనులు




నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): సకాలంలో వర్షాలు కురుస్తుండడం.. వరద చేరికతో జిల్లాలోని జలాశయాల్లో నీటి నిల్వలు సమృద్ధిగా ఉన్నాయి. దీంతో ఉమ్మడి నెల్లూరు జిల్లాలో రైతులు రెండో పంట సాగుకు రైతాంగం సిద్ధమవుతున్నారు. వారి కోసం ప్రభుత్వం సోమవారం సోమశిల, కండలేరు జలాశయాల నుంచి ప్రభుత్వం నీటిని విడుదల చేస్తుంది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత క్రమం తప్పకుండా రెండో పంట సాగుకు నీరందిస్తోంది. దీనికోసం అధికారులు సమావేశాలు నిర్వహించి పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్నారు.

ఎన్ని ఎకరాలకంటే..?

సోమశిల జలాశయం నుంచి పెన్నా డెల్టా పరిధిలో 1.80 లక్షల ఎకరాలు, కనుపూరు కాలువ కింద 30 వేలు, కావలి కాలువ కింద 30 వేలు, జీకేఎస్ కాలువ కింద 25 వేలు, దక్షిణ కాలువ కింద 20 వేల ఎకరాలు మొత్తం కలిపి 2.85 లక్షల ఎకరాల్లో రెండో పంటను సాగు చేయనున్నారు. కండలేరు, ఇతర కాలువల పరిధిలో 1.4 లక్షల ఎకరాలకు నీరు అందించనున్నారు. మొత్తంగా 4.25 లక్షల ఎకరాల్లో సాగు జరగనుంది. ఐఏబీ (సాగునీటి సలహా మండలి) తీర్మానాన్ని అనుసరించి ఈ కేటాయింపులను అధికారులు నిర్దేశించారు. జిల్లాలో వరి పంట విస్తారంగా వేయకుండా ఇతర పంటలు సాగు చేసేలా రైతుల్లో అవగాహన కల్పించారు. ఆయా ప్రాంతాలకు అనువుగా ఇతర పంటలను వేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

సాగు ఇలా..

సోమశిల పరిధిలో..	2.85 లక్షల ఎకరాలు
కండలేరు పరిధిలో..	1.40 లక్షల ఎకరాలు



కండలేరు జలాశయం

నీటి లభ్యత, విడుదల

ప్రస్తుతం సోమశిల జలాశయంలో 50 టీఎంసీలు, కండలేరు జలాశయంలో 40 టీఎంసీల నీరు అందుబాటులో ఉంది. సోమశిల నుంచి సంగం ఆయకట్టులో దువ్వూరు కాలువ, దక్షిణ కాలువ, జీకేఎస్ కాలువ, పైడేరు, డీఆర్ చానెల్, కొత్త యల్లాయపాళెం, కొత్త వవ్వేరు చానెల్ ద్వారా, కనుపూరు కాలువ ద్వారా డెల్టా ప్రాంతంలో నీటిని అందించనున్నారు. నెల్లూరు డెల్టా పరిధిలో కుడితిపాళెం, లేబూరు, గంగపట్నం, మైపాడు, వెంకన్నపాళెం, వరిగొండ, ఎంపీ చానెల్, కోడూరు కాలువల ద్వారా నీటి సరఫరా జరుగుతుంది. సర్వేపల్లి కాలువ నుంచి కృష్ణపట్నం, వల్లూరు, సర్వేపల్లి రిజర్వాయర్ ద్వారా ఆయా ప్రాంతాలకు నీటిని అందించనున్నారు. కండలేరు జలాశయం నుంచి చెన్నైకి తాగు నీటితోపాటు రాపూరు, పొదలకూరు, వెంకటగిరి, సూళ్లూరుపేటలకు వివిధ కాలువల ద్వారా అలాగే స్వర్ణముఖి బ్యారేజీ ద్వారా నీరందించనున్నారు.

మరమ్మతులు వేగవంతం

రెండో పంటకు నీరందించే క్రమంలో వృథాను తగ్గించేందుకు రూ.5 కోట్లతో వివిధ కాలువలకు మరమ్మతులు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. కాలువలు అధికంగా దెబ్బతిన్న ప్రాంతాల్లో అవసరాన్ని బట్టి ఈ పనులను చేపట్టారు.

నీటిని వృథా చేయొద్దు



రైతులు నీటిని వృథా చేయొద్దు, వరితోపాటు వరేతర పంటలను వేస్తే మంచిది. నాలుగు సంవత్సరాలుగా రెండో పంటకు క్రమం తప్పకుండా నీరిస్తున్నాం. రెండు బ్యారేజీల నిర్మాణాలు, నీటి క్రమబద్ధీకరణ వల్ల రైతులకు ఎంతో లాభం చేకూరింది. అధికారులు నిర్దేశించిన మేరకు పంటలను వేసుకుని నీటిని పొదుపుగా వాడాలి.

– పి.కృష్ణమోహన్, ఇరిగేషన్ ఎస్ఈ

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

- లబ్ధిదారులు 3,09,649 మంది
- నగదు రూ.86 కోట్లు

నెల్లూరు(పొగతోట): జిల్లాలో సోమవారం నుంచి వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీకి అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. తెల్లవారుజాము నుంచే వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పింఛన్ల పంపిణీని ప్రారంభించనున్నారు. జిల్లా వ్యాప్తంగా 3,09,649 మంది లబ్ధిదారులున్నారు. వారి కోసం రూ.86,02,96,000 నగదు కేటాయించగా ఇప్పటికే సచివాలయాల పరిధిలోని వలంటీర్లకు నగదు అందజేశారు. ఈ నెల ఐదో తేదీ వరకు పింఛన్లు పంపిణీ చేస్తామని, లబ్ధిదారులు అందుబాటులో ఉండాలని డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి ఆదివారం తెలిపారు.

నరసింహుని బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

నెల్లూరు రూరల్: నెల్లూరు రూరల్ పరిధిలోని నరసింహకొండపై కొలువైన వేదగిరి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆదివారం అంకురార్పణ చేశారు. ఈ సందర్భంగా పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామి, ఆదిలక్ష్మి అమ్మవారికి విశేష అలంకారం చేశారు. ఉత్సవాల సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్ సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

పెంచలకోనకు బ్రహ్మోత్సవ శోభ

- నేడు అంకురార్పణ
- ఏర్పాట్లు చేసిన అధికారులు



పెనుశిల లక్ష్మీనరసింహస్వామి ఆలయం

రాపూరు: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీ నరసింహస్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. సోమవారం రాత్రి అంకురార్పణతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. ఏడో తేదీ వరకు జరుగుతాయి. ఉత్సవాలకు సుమారు రెండు లక్షల మంది పైగా భక్తులు వస్తారని అంచనా. పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీ దేవి, చెంచులక్ష్మి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను గోనుపల్లిలోని పెనుశిలస్వామి ఆలయం నుంచి పల్లకిలో కాలినడకన పెంచలకోనకు తీసుకెళ్లడం ఆనవాయితీ.

గోనుపల్లిలో సందడి

బ్రహ్మోత్సవాల నేపథ్యంలో గోనుపల్లి గిరిజనవాడలో పండగ వాతావరణం నెలకొంది. నరసింహస్వామి చెంచుల అల్లుడు కావడంతో ఉత్సవాలు, కల్యాణం తమ ఇంట్లో జరిగే శుభ కార్యంగా గిరిజనులు భావిస్తారు. ప్రతి ఇంటి ముందు పందిళ్లు వేసుకుంటారు. గోనుపల్లిలోని పెనుశిల ఆలయం నుంచి ప్రతి ఏటా శ్రీవారు, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పల్లకిలో కాలినడకన పెంచలకోనకు తీసుకెళ్లడం ఆనవాయితీ. స్వామికి లాంఛనాలు అందజేసేందుకు గిరిజనులు తెల్లవారుజామున అడవికి వెళ్లి పుట్టతేనె, ఇంజేటిగడ్డలు, సారపప్పు తదితర సరుకులను తీసుకొస్తారు. కట్నంగా ఆరినార మొలతాడు అందజేస్తారు.

రోజూ ఇలా..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 7 గంటలకు గోనుపల్లి పెనుశిల దేవస్థానం నుంచి స్వామి, అమ్మవార్ల విగ్రహాలు పెంచలకోనకు చేరుకుంటాయి. రాత్రి 8 గంటలకు అంకురార్పణ, 9 గంటలకు సేనాధిపతి ఉత్సవం జరుగుతుంది. 2న ధ్వజారోహణం, శేషవాహనసేవ, 3న ఉదయం హంస వాహనసేవ, రాత్రి బంగారు హనుమంత వాహనసేవ, 4న సింహ వాహనసేవ, గరుడ వాహనసేవ, 5న కల్యాణోత్సవం, రథోత్సవం, అశ్వవాహనసేవ, 6న చక్రస్నానం, తెప్పోత్సవం, 7న స్వామి, అమ్మవార్లకు గోనుపల్లిలో నిర్వహించే క్షేత్రోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయి.

ప్రత్యేక బస్సుల ఏర్పాటు

నెల్లూరు, వైఎస్సార్, తిరుపతి జిల్లాలు తదితర ప్రాంతాల నుంచి 120 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ అనిల్‌కుమార్ తెలిపారు. నెల్లూరు, గూడూరు, రాపూరు, వెంకటగిరి, ఆత్మకూరు, ఉదయగిరి, వాకాడు, కావలి, వెంకటగిరి, గూడూరు నుంచి 85 సర్వీసులు, కడప, మైదుకూరు, రాజంపేట, బద్వేల్ నుంచి బస్సులు నడపనున్నట్లు చెప్పారు.

భారీ పోలీసు బందోబస్తు

బ్రహ్మోత్సవాలకు భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని రాపూరు సీఐ కోటేశ్వరావు తెలిపారు. ఒక డీఎస్పీ, ఏడుగురు సీఐలు, 20 మంది ఎస్సైలతోపాటు ఏఎస్ఐలు, పోలీసులు, మహిళా పోలీసులు, హోంగార్డులు, ఏఆర్ పార్టీతో కలిపి 350 మందిని నియమించామన్నారు.

సేవా కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యం

- రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి



వాటర్ ప్లాంట్‌ని ప్రారంభించి మహిళకు నీటి బిందెను అందజేస్తున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

వింజమూరు(ఉదయగిరి): వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. వింజమూరు మండలంలోని ఊటుకూరు గ్రామం ఇందిరానగర్ కాలనీలో వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్‌ప్లాంట్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వీపీఆర్ అమృతధార పథకం కింద 2017 సంవత్సరం నుంచి ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 103 మినరల్ వాటర్‌ప్లాంట్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలోని 8 మండలాల్లో 24 ప్లాంట్లు పెట్టామన్నారు. ఊటుకూరుకు పంచాయతీకి మోడల్ పంచాయతీగా గుర్తింపు ఉందన్నారు. గ్రామస్తుల కోరిక మేరకు సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీ స్టేట్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టుకూరు చిరంజీవిరెడ్డి, సీనియర్ నాయకుడు కాటంరెడ్డి రవీంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులురెడ్డి, సర్పంచ్ రొడ్డా వెంగమ్మ, స్థానిక నాయకులు కొండయ్య, పల్లాల కొండారెడ్డి, వి.సుబ్బారెడ్డి, విజయకృష్ణారెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కొరియోగ్రాఫర్ ఆత్మహత్య

- ఆర్థిక ఇబ్బందులే కారణం
- స్నేహితులకు సెల్ఫీ వీడియో పంపిన వైనం



మృతుడు చైతన్య

నెల్లూరు సిటీ: 'అతను ఓ టీవీ షోలో డ్యాన్స్ మాస్టర్ అండ్ కొరియోగ్రాఫర్. మంచి పేరు వచ్చింది. కానీ సంపాదనలో మాత్రం వెనుకబడ్డాడు. కుటుంబాన్ని ఉన్నత స్థాయిలో నిలబెట్టాలని కలలు కన్నాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏమి చేయలేకపోయాడు. దీంతో మానసికంగా కుంగిపోయిన అతను ఆత్మహత్యే శరణ్యం అనుకుని నిర్ణయించుకున్నాడు. ఫ్యాన్‌కు ఉరేసుకుని నిండు జీవితాన్ని అర్ధాంతరంగా ముగించాడు.' ఆదివారం పోలీసులు వెల్లడించిన వివరాల మేరకు.. లింగసముద్రం మండలంలోని ముత్తంవారిపాళేనికి చెందిన సుబ్బారావు, లక్ష్మి రాజ్యం దంపతులకు సి.చైతన్య (31), వినీల అనే పిల్లలున్నారు. చైతన్య హైదరాబాద్‌లో ఉంటూ ఐదేళ్లుగా ఢీ షోలో ఓ బృందానికి కొరియోగ్రాఫర్‌గా చేస్తున్నాడు. ఈ క్రమంలో నెల్లూరు నగరంలోని టౌన్‌హాల్లో శనివారం జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చాడు. అనంతరం నగరంలోని దర్గామిట్టలో ఉన్న నెల్లూరు క్లబ్‌లో గది తీసుకున్నాడు. చైతన్య తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సెల్ఫీ వీడియో తీసి స్నేహితులకు పంపాడు. 'అమ్మా, నాన్న, చెల్లి ఐ లవ్ యూ.. నన్ను చాలా బాగా చూసుకున్నారు. ఏ కష్టం రానివలేదు. చెల్లీ ఫీల్ కావద్దు. నువ్వంటే చాలా ఇష్టం. కుటుంబానికి చాలా చేద్దామనుకున్నాను. కుదరలేదు. అప్పులు అవుతాం. తీర్చుకునే సత్తా ఉండాలి. తీర్చగలను కానీ అంతా తీర్చలేకపోతున్నా. ఒత్తిళ్లు తట్టుకోలేకపోతున్నా. చాలా ప్రయత్నిస్తున్నా. కావట్లేదు. ఢీ పేరు ఇస్తుంది. కానీ సంపాదన తక్కువ ఇస్తుంది. జబర్దస్‌లో సంపాదన ఎక్కువ వస్తుంది. స్నేహితులు, తోటి డ్యాన్సర్లకు సారీ' అని ఆ వీడియోలో ఉంది. కాగా చైతన్య స్నేహితులు వీడియో చూసి నెల్లూరు పోలీసులకు సమాచారం అందించారు. వారు చైతన్య ఉంటున్న గది వద్దకు చేరుకుని తలుపు తట్టారు. ఎంతకీ తీయకపోవడంతో కిటికీలో నుంచి చూడగా అప్పటికే అతను ఉరేసుకుని ఉన్నాడు. దీంతో ధనలక్ష్మీపురంలో నివాసం ఉంటున్న చైతన్య మేనమామ మాల్యాద్రికి పోలీసులు సమాచారం అందించారు. మాల్యాద్రి ఫిర్యాదు మేరకు దర్గామిట్ట ఎస్సై విజయకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అలుపెరగని ఎర్రసూరీడు

- నేటి తరానికి స్ఫూర్తి పుచ్చలపల్లి సుందరయ్య
- కమ్యూనిస్టు సిద్ధాంతాల వైపు పయనం





అలగానిపాడులో నిర్మించిన గ్రంథాలయం

నెల్లూరు: చిన్ననాటి నుంచి ఉద్యమాల వైపు నడచిన పోరాట యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య. ఆయన నేటి తరం రాజకీయ నాయకులకు, సమాజంలోని ప్రతి పౌరుడికి ఆదర్శనీయులు. జిల్లాలోని ఓ చిన్న కుగ్రామంలో జన్మించిన ఆయన దేశ చరిత్రలోనే తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. విడవలూరు మండలంలోని అలగానిపాడు అనే చిన్న మారుమూల గ్రామానికి చెందిన పుచ్చలపల్లి వెంకటరామిరెడ్డి – శేషమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు, నలుగురు కుమార్తెలు జన్మించారు. వీరిలో రెండో సంతానంగా మే ఒకటో తేదీ 1913న సుందరరామిరెడ్డి(సుందరయ్య) జన్మించారు. ఆయన ప్రాథమిక విద్యాభ్యాసం స్వగ్రామం అలగానిపాడు వీధిబడిలోనే సాగింది. చిన్నతనం నుంచి ఆయనలో అభ్యుదయ భావాలు ఉండడంతో హైస్కూల్ విద్యను ఇతర ప్రాంతాల్లో కొనసాగించేలా తల్లిదండ్రులు చర్యలు తీసుకున్నారు. రాజమండ్రి, మద్రాసులోని తిరువల్లూరు ప్రాంతాల్లో సుందరయ్య ఎస్ఎస్ఎల్‌సీ పూర్తి చేశారు. సుందరయ్య 1946 ఫిబ్రవరి 29న లీలావతిని వివాహమాడారు. వివాహ అనంతరం పిల్లలకు జన్మనిస్తే ఉద్యమాలతోపాటు తన ప్రాణం కన్నా ఎక్కువగా భావించే సిద్ధాంతాలకు ఆటంకం ఏర్పడుతుందని భావించిన ఆయన లీలావతికి ఈ విషయాన్ని వివరించారు. అప్పటికే కమ్యూనిస్టు పార్టీలో చురుకైన పాత్ర పోషిస్తున్న సుందరయ్య అందరికీ ఆదర్శంగా నిలచారు.

సైకిల్‌పైనే పార్లమెంట్‌కు..

1952లో రాజ్యసభకు ఎన్నికైన సుందరయ్య పార్లమెంట్ సమావేశాలకు సైకిల్‌పైనే వెళ్లి సభలో ప్రజా సమస్యలను ప్రస్తావించేవారు. తనకున్న యావదాస్తిని తన ఉద్యమాలకు స్ఫూర్తిగా నిలచిన పార్టీకి రాసి ఇచ్చారు. కేవలం పార్టీ ఇచ్చే గౌరవ వేతనంతోనే జీవనం సాగించేవారు. సైకిల్‌పై సభలకు వెళ్లిన ఆయన ఆనాడే అన్ని రాజకీయ పార్టీల సభ్యులకు ఆదర్శంగా నిలచారు. దేశంలో ఉక్కు పరిశ్రమల బలోపేతానికి ఆయన చేసిన కృషి మరువలేనివి.

స్వగ్రామంలోనే ఉద్యమాల బాట

సుందరయ్య ఆయన స్వగ్రామం అలగానిపాడులోనే ఉద్యమాలకు బాట వేసుకున్నారు. 1972లో స్వగ్రామంలో వ్యవసాయ కూలీల సంక్షేమ సంఘాన్ని ఏర్పాటు చేశారు. అది కాలక్రమేణ రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించింది. చదువుకునే రోజుల్లో సోషలిస్టు నేత హెచ్‌డీ రాజా సుందరయ్య వసతి గృహానికి వచ్చారు. ఆయన ప్రసంగాన్ని ఆసక్తిగా విన్న సుందరయ్య ఉద్యమాలకు బాట పట్టారు. తెలంగాణ పోరాటాల్లోనూ చురుకైన పాత్ర పోషించారు. అక్కడ నిరుపేదలకు భూములను పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకున్నారు. ఇలా తన ప్రస్థానాన్ని కొనసాగించిన సుందరయ్య 1985 మే 19న తుదిశ్వాస విడిచి అందరి గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. ఆయన నివాస స్థలంలోనే ప్రస్తుతం గ్రామస్తులకు ఉపయోగపడేలా గ్రంథాలయాన్ని, గ్రామంలో పంచాయతీ కాంప్లెక్స్ నిర్మించారు. మేడే రోజే ఆయన జయంతి కావడం విశేషంగా గ్రామస్తులు భావిస్తున్నారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేస్తున్నట్లు స్థానికులు వివరించారు.

చంద్రబాబు ఏం చేశారో ప్రజలకు చెప్పాలి

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం: నలభై ఏళ్ల రాజకీయ అనుభవం ఉందని చెప్పుకునే ప్రతిపక్షనేత చంద్రబాబు తాను సీఎంగా ఉన్నప్పుడు ప్రజలకు ఏం చేశారో ధైర్యంగా చెప్పాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని ఈదగాలి గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మంత్రి మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వంలో ఎన్టీఆర్ హయాంలో అమలు చేసిన పథకాలను కొనసాగించడం తప్ప చంద్రబాబు కొత్తగా ఏం చేశారో చెప్పాలన్నారు. దివంగత నేత వైఎస్సార్ హయాంలో పేదలకు ఆరోగ్యశ్రీ, ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమ్మఒడి లాంటి ఎన్నో ప్రతిష్టాత్మక పథకాలు అమలు చేశారని తెలిపారు. కానీ చంద్రబాబు హయాంలో కొత్తగా పెన్షన్ పొందాలంటే గ్రామాల్లో ఎవరైనా చనిపోతేనే కొత్తవారికి పెన్షన్ పరిస్థితి ఉండేదని గుర్తుచేశారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నందునే ఒంటరిగా, ధైర్యంగా పోటీ చేస్తానని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెబుతున్నారని, అయితే చంద్రబాబుకు ఆ ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. ఏళ్ల తరబడి పరిష్కారం కాని చుక్కల భూముల సమస్యను పరిష్కరించడంతో జిల్లాలో 23,023 రైతులకు సంబంధించి 43,270 ఎకరాలకు త్వరలో విముక్తి కలగనుందని తెలిపారు.

నెల్లూరు అల్లుడ్ని కావడం గర్వంగా ఉంది

- సినీ నటుడు శుభలేఖ సుధాకర్
- కళాంజలి పురస్కారం ప్రదానం




కళాంజలి పురస్కారం అందుకుంటున్న శుభలేఖ సుధాకర్

నెల్లూరు(బృందావనం): ఎందరో కళాకారులను అందించిన నెల్లూరుకు అల్లుడిని కావడం గర్వకారణంగా ఉందని ప్రముఖ సినీ నటుడు శుభలేఖ సుధాకర్ అన్నారు. కళాంజలి 35వ వార్షికోత్సవం సందర్భంగా నెల్లూరు పురమందిరంలో ఆదివారం రాత్రి కళాంజలి పురస్కారాన్ని సుధాకర్‌కు రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ సంగీతానికి మంత్రముగ్ధులను చేసే శక్తి ఉందన్నారు. తనకు పాటలు పాడడం ఇష్టమని అయితే.. ప్రముఖ సింగర్ తన భార్య ఎస్పీ శైలజ దయచేసి మీరు పాటలు పాడవద్దని వారి మధ్య జరిగిన సంభాషణను చమత్కారంగా వివరించారు. మారుతున్న కాలంతోపాటు 35 సంవత్సరాలుగా కళాంజలి సంస్థ చేస్తున్న సేవలను అభినందించారు. అలాగే పాడుతా తీయగా ఫైనలిస్ట్ శరత్‌చంద్రకు కళాంజలి అవార్డును అందజేశారు. కార్యక్రమంలో లాయర్ వారపత్రిక సంపాదకుడు తుంగా శివప్రభాత్‌రెడ్డి, కాసా పెంచల వరప్రసాద్ నాయుడు, బయ్యా వెంకటరవికుమార్, వీరిశెట్టి హజరత్‌బాబు, వాకాటి విజయకుమార్‌రెడ్డి, ఎన్.బలరామయ్యనాయుడు, ఎస్వీ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. వ్యాఖ్యాతగా డి.అరుణ్ కుమార్ వ్యవహరించారు. బిల్లీశ్యాంసన్ ఆధ్వర్యంలో గాయకబృందం పాడిన పాటలు అలరించాయి. కార్యక్రమాన్ని కళాంజలి వ్యవస్థాపకుడు అనంత్, ఆర్గనైజర్ దువ్వూరు బెనర్జీ, సభ్యులు జి.శివకుమార్‌రెడ్డి పర్యవేక్షించారు.

హరిహరక్షేత్రం నల్లగొండ్ల

- జిల్లాలో ఏకైక శైవ వైష్ణవ క్షేత్రం
- 2 నుంచి లక్ష్మీనరసింహుని బ్రహ్మోత్సవాలు



నల్లగొండ్ల క్షేత్రం

వింజమూరు(ఉదయగిరి): హరిహరులకు నిలయమైన క్షేత్రంగా మండలంలోని నల్లగొండ్ల క్షేత్రం విరాజిల్లుతోంది. ఈ క్షేత్రంలో శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీనరసింహస్వామి, త్రయంబికా సమేత మల్లేశ్వర స్వామి నిత్యం పూజలందుకుంటున్నారు. ప్రతి ఏడాది వైశాఖ శుద్ధ ద్వాదశి రోజున స్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమై తొమ్మిది రోజులపాటు వైభవంగా జరుగుతాయి. నల్లని కొండరాళ్లతో ఉన్న ఈ క్షేత్రానికి నల్లగొండ్ల అనే పేరు వచ్చిందని స్థానికులు చెబుతుంటారు.

బ్రహ్మోత్సవాల వివరాలు

ఈ నెల 2న అంకురార్పణ, 3న ధ్వజారోహణం, 4న నృసింహ జయంతి, 5న బంగారు గరుడసేవ, 6న గజోత్సవం, 7న శ్రీవారి కల్యాణోత్సవం, రాత్రికి హయగజ ఉత్సవం, 8న ఉదయం అలకలతోపు మహోత్సవం, 9న వసంతోత్సవం, 10న ఏకాంతసేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. ఉత్సవాలకు జిల్లాలోని నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు.

అలకలతోపు ప్రాశస్త్యం

భారతదేశంలో ఏ క్షేత్రంలోనూ లేనటువంటి కనీ వినీ ఎరుగని రీతిలో జరిగే శ్రీవారి, దేవేరుల అలకలతోపు (పరుగు పందెం) గాంధీబొమ్మ సెంటర్ నుంచి కొండపైవున్న దేవాలయం వరకు జరుగుతుంది. శ్రీవారు కొండకు తూర్పువైపునున్న మెట్లపై నుంచి, అమ్మవారు పడమర వైపుగల మెట్లపై నుంచి కొండపైని దేవాలయానికి వెళతారు. భక్తులు శ్రీవారిని, అమ్మవార్లను త్వరగా పైకి చేర్చేందుకు తల్లేరు నిర్వహించి పోటీపడతారు. ఎవరు ముందుగా చేరితే వారు విజయం సాధించినట్లు భక్తులు భావిస్తారు. శ్రీవారు విజయం సాధిస్తే వాణిజ్య పంటలు(మెట్టపైర్లు) బాగా పండుతాయని, అమ్మవార్లు విజయం సాధిస్తే మాగాణి పంటలు సమృద్ధిగా పండుతాయని భక్తులు నమ్ముతారు.

బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు



బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేశాం. భక్తులకు తాగునీరు, అన్నదానం ఏర్పాటు చేస్తాం. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తాం. వింజమూరు పోలీసులు, వైద్యసిబ్బంది, ఇతర శాఖల అధికారుల సహకారంతో బ్రహ్మోత్సవాలు ప్రశాంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటాం.

– అన్నపురెడ్డి మోహన్‌రెడ్డి, నల్లగొండ్ల దేవస్థానం కమిటీ చైర్మన్

గొర్రెల లారీతో వ్యక్తి పరారీ

బుచ్చిరెడ్డిపాళెం: గొర్రెలను కొనుగోలు చేసిన వ్యక్తి వాటిని తరలిస్తున్న లారీతో పరారు కాగా, వాటిని విక్రయించిన తెలంగాణవాసులు దిక్కుతోచని స్థితిలో ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుల కథనం మేరకు తెలంగాణ రాష్ట్రం వనపర్తి జిల్లా పాలగల్లుకు చెందిన కృష్ణయ్య, నియాపూర్‌కు చెందిన తూకన్న గొర్రెల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరు శుక్రవారం గొర్రెలను విక్రయించేందుకు తెలంగాణలోని ఒక సంతకు తరలించారు. శనివారం నెల్లూరు జిల్లా కావలి మండలానికి చెందిన వెంకటేష్ అనే వ్యక్తి వారి వద్దకు వెళ్లి 65 గొర్రెలను దాదాపు రూ.5.40 లక్షలకు కొనుగోలు చేశాడు. అయితే గొర్రెలు కొనుగోలు చేసిన వెంకటేష్ తన వద్ద కేవలం రూ.3.50 లక్షల మాత్రమే ఉన్నాయని, మిగిలిన రూ.1.90 లక్షలు కావలి వద్ద ఇస్తానని చెప్పి నమ్మబలికాడు. దీంతో వెంకటేష్ తీసుకువచ్చిన లారీలో తాము విక్రయించిన 65 గొర్రెలను ఎక్కించి వారు కూడా అందులోనే ఎక్కారు. లారీ శనివారం రాత్రి 9 గంటల సమయంలో కర్నూలు మీదుగా బుచ్చిరెడ్డిపాళెంకు లారీ చేరుకుంది. వెంకటేష్ తనకు ఆకలి వేస్తుందని చెప్పడంతో అతనితోపాటు కృష్ణయ్య, తూకన్న, వెంకటేష్ కుమారుడు, లారీ డ్రైవర్ అందరూ దిగి స్థానికంగా ఉన్న ఒక హోటల్‌లో టిఫిన్ చేశారు. కృష్ణయ్య, తూకన్న టిఫిన్ చేస్తుండగానే వెంకటేష్, అతని కుమారుడు, డ్రైవర్ లారీని తీసుకుని పరారయ్యాడు. ఈ ఘటనపై పోలీస్‌లకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు

కావలి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని 36వ వార్డులో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డితో కలిసి 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శక పాలనతో ప్రగతికి శ్రీకారం చుట్టారన్నారు. గ్రామస్థాయి నుంచే వలంటీర్, సచివాలయ వ్యవస్థలను ఏర్పాటు చేసి లబ్ధిదారులందరికీ ఇంటి వద్దనే పథకాలు అందించేలా చర్యలు చేపట్టారని వివరించారు. గతంలో మాదిరి ప్రభుత్వ పథకాల కోసం ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని, గ్రామస్థాయిలోనే సచివాలయాల ద్వారా సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు.

జనం గుండెల్లో సీఎం వైఎస్ జగన్ : ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని జనం గుండెల్లో పెట్టుకుంటున్నారని కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా కన్యకాపరమేశ్వరి నగరోత్సవం

నెల్లూరు(బృందావనం): శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి సందర్భంగా ఆదివారం రాత్రి నగరోత్సవం వైభవంగా సాగింది. స్టోన్‌హౌస్‌పేటలోని అమ్మవారి ఆలయంలో 500 మంది మహిళలతో లక్ష కుంకుమార్చన, విశేష పూజలు నిర్వహించారు. పులివాహనంపై కొలువుదీరిన వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి నగరోత్సవం స్టోన్‌హౌస్‌పేట, నవాబుపేట, శెట్టిగుంటరోడ్డు తదితర ప్రధాన మార్గాల్లో కొనసాగింది. కార్యక్రమంలో నుడా చైర్మన్, ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్, సుంకు మనోహర్, బితా రామచంద్రరావు, శ్రీరాం సురేష్, సరాబు సుబ్రహ్మణ్యం, పబ్బిశెట్టి శ్రీనివాసులు, చలువాది శరణ్‌కుమార్, సముద్రాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



నగరోత్సవంలో ముక్కాల ద్వారకానాథ్ తదితరులు



నగరోత్సవంలో భక్తులను కటాక్షిస్తున్న వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారు

హైవేపై కంటైనర్ లారీ దగ్ధం



మంటలు వ్యాపించి దగ్ధమైన కంటైనర్ లారీ

దగదర్తి(కావలి): దగదర్తి మండలం ఉలవపాళ్ల పెట్రోల్ బంక్ సమీపంలో ప్రమాదవశాత్తు కంటైనర్ లారీలో మంటలు చెలరేగి లారీ పూర్తిగా దగ్ధమైన ఘటన ఆదివారం వేకువజామున చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు ప్రైవేట్ డెయిరీకి చెందిన పాలప్యాకెట్లు, ఇతర పాల ఉత్పత్తులతో చిత్తూరు నుంచి విజయవాడకు వెళుతున్న కంటైనర్ లారీ ఉలవపాళ్ల పెట్రోల్‌బంక్ సమీపంలోకి వచ్చే సరికి ప్రమాదవశాత్తు అదుపుతప్పి రోడ్డు అంచున ఉన్న ఫెన్సింగ్‌ను, రాళ్లను ఢీకొట్టింది. ఈ క్రమంలో లారీ క్యాబిన్‌లో మంటలు చెలరేగి నిమిషాల వ్యవధిలోనే వ్యాపించాయి. డ్రైవర్, క్లీనర్ సురక్షితంగా లారీ నుంచి బయటపడి పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపుచేశారు. అప్పటికే లారీ క్యాబిన్ పూర్తిగా దగ్ధమైంది. ఎస్సై సుమన్ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

కావలిరూరల్: కుటుంబ కలహాల నేపథ్యంతో గోనే ఫకీర్(32) అనే వ్యక్తి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం కావలిరూరల్ మండలం మన్నంగిదిన్నె గ్రామంలో చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై ఎం.వెంకట్రావు తెలిపిన వివరాల మేరకు కావలిరూరల్ మండలం మన్నంగిదిన్నె గ్రామానికి చెందిన గోనే ఫకీర్ ఆటో నడుపుతూ జీవనం సాగించేవాడు. అతనికి భార్య రవళి, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆదివారం తెల్లవారుజామున బహిర్భూమికి వెళుతున్నానని గ్రామానికి సమీపంలోని అడవిలోకి వెళ్లి వేపచెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కావలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిమ్మధరలు (కిలో)

పెద్దవి	: రూ.65
సన్నవి	: రూ.35
పండ్లు	: రూ.20

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 126
లేయర్ (లైవ్)	: 80
బ్రాయిలర్ చికెన్	: 220
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 244
లేయర్ చికెన్	: 136